నాగారం : నాగారంలో నిర్వహించిన రాములవారి కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే మందుల సామేల్

సూర్యాపేట : అంబేద్కర్‌నగర్ రామాలయంలో పూజలు చేస్తున్న కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

కమనీయం... సీతారాముల కల్యాణం

గరిడేపల్లి, ఏప్రిల్ 17 : శ్రీరామ నవమి పండుగ సందర్భంగా బుధవారం సీతారాముల కల్యాణాన్ని జిల్లా వ్యాప్తంగా ప్రజలు కనుల పండువగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లో గల ఆలయ కమిటీల ఆధ్వర్యంలో కల్యాణ మండపాలను పచ్చని తోరణాలతో అందంగా అలంకరించగా అర్చకులు స్వామి వారి కల్యాణాన్ని మేళతాళాలు, వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. కల్యాణంను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. పలు గ్రామాల్లో పెద్ద ఎత్తున అన్నదానాలు చేయడంతో పాటు బెల్లం పానకంను పంపిణీ చేశారు. సాయంత్ర వేళలో గ్రామాల్లో స్వామి, అమ్మవారి విగ్రహాలను వైభవంగా ఊరేగించారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు, పలువురు ప్రజా ప్రతినిధులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సునీత దంపతులు పట్టువస్త్రాల సమర్పణ

సూర్యాపేట టౌన్ : జిల్లా కేంద్రంలోని వేదాంత భజన మందిరంలో నిర్వహించిన సీతారామచంద్రస్వామి కల్యాణోత్సవంలో మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సునీత దంపతులు పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి కల్యాణతంతు జరిపించారు. అంతకు మందు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుంచి సీతారామచంద్రస్వామికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలను ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కల్యాణ మండపంలో ఆలయ ప్రధాన అర్చకుడు సింగారాచార్యులు స్వామి అమ్మవార్లను ఆసీనులను చేసి ప్రత్యేక పూజలు నిర్వహించి అంగరంగ వైభవంగా కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. స్వామి అమ్మవార్లకు ముత్యాల తలంబ్రాలు పోసి హారతులు ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, నాయకులు ఉప్పల ఆనంద్, నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, మొరిశెట్టి శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిశోర్, కౌన్సిలర్ తాహేర్‌పాషా, ఆలయ కమిటీ అధ్యక్షుడు రాచర్ల వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ఎన్నికల వేళ సామాజిక మాధ్యమాల్లో జాగ్రత్త

- హద్దు మీరితే జైలుకే
- పోస్ట్ చేసిన వ్యక్తి, అడ్మిన్ ఇద్దరూ బాధ్యులే

హుజూర్‌నగర్, ఏప్రిల్ 17 : చేతిలో స్మార్ట్ ఫోన్.. ఇంకేముంది ఇష్టం వచ్చినట్లుగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడతామని అనుకుంటున్నారా ? అయితే మీరు చిక్కుల్లో పడకతప్పదు. మత, రాజకీయ, వ్యక్తిగత అంశాలకు సంబంధించి ఇతరుల మనోభావాలు దెబ్బతీసేలా వాట్సాప్, ఫేస్‌బుక్, ఎక్స్(ట్విట్టర్), ఇన్‌స్టాగ్రామ్ తదితర సామాజిక మాధ్యమాల్లో ఎలాంటి పోస్టులు పెట్టినా పోలీసు కేసులను ఎదుర్కోవాల్సిందే. జైలు ఊచలు లెక్క పెట్టాల్సిందే. సాధారణ ఎన్నికల కోడ్ నేపథ్యంలో సామాజిక మాధ్యమ పోస్టింగ్‌లపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఎన్నికల వేళ ప్రత్యర్థి పార్టీల నాయకులు, అభ్యర్థులు పరస్పరం తీవ్రస్థాయిలో విమర్శలు చేసుకునే అవకాశం ఉన్నది. ఆయా పార్టీలకు సోషల్ మీడియా విభాగాలున్నాయి.

అడ్మిన్లదే పూర్తి బాధ్యత

- సామాజిక మాధ్యమ గ్రూప్‌ల్లో ముఖ్యంగా వాట్సాప్‌లో అభ్యంతరకర, విద్వేషాలను రెచ్చగొట్టేలా గ్రూపులోని సభ్యులెవరూ పోస్టులు పెట్టినా అడ్మిన్ పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది
- అభ్యంతరకర పోస్టులు పెట్టిన వారిని గ్రూపు నుంచి తొలగించడంతో పాటు సదరు పోస్టును సైతం వెంటనే తొలగించాలి
- గతంలో కేవలం పోస్టు చేసిన వారు మాత్రమే దాన్ని తొలగించే అవకాశముండగా ప్రస్తుతం గ్రూపులోని ఏ సభ్యుడు పెట్టిన పోస్టు అయినా అడ్మిన్ తొలగించే వీలున్నది.
- గ్రూపులో కొత్త సభ్యులను చేర్చుకునే ముందు వారి అనుమతి తీసుకోవడంతో పాటు తప్పుడు పోస్టులు పెట్టిన వారిని తొలగించి పోలీసులకు సమాచారం అందించాల్సిన బాధ్యత కూడా అడ్మిన్‌దే
- సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యే తప్పుడు పోస్టులపై ఎవరూ ఫిర్యాదు చేయకపోయినా పోలీసులు సుమోటోగా కేసులు నమోదు చేసే అవకాశం ఉన్నది
- ఎన్నికల వేడి రాజుకుంటున్న నేపథ్యంలో ప్రత్యర్థులను అవమాన పరిచేలా, తమ అభ్యర్థి గొప్పతనాన్ని వివరిస్తూ పోస్టులు పెట్టే అవకాశం ఉన్నది.
- ప్రత్యర్థులను కించపరిచే వ్యాఖ్యలు, వ్యక్తిగత దూషణలు, ఫొటోలు మార్ఫి, వాయిస్ మేసేజ్‌లు, వాస్తవ విరుద్ధంగా పోస్టులు పెట్టినా, వాటిని షేర్ చేసినా, వాటికి మద్దతు తెలుపుతూ కామెంట్లు చేసినా చట్టరీత్యా శిక్షలు తప్పవు
- తమ అనుమతి లేకుండా గ్రూపులో చేర్పుకునే అవకాశం లేకుండా వాట్సాప్‌లో ప్రత్యేక ఆప్షన్‌ను సెల్‌ఫోన్ వినియోగదారులు ఎంచుకోవడం ఉత్తమం

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మేళ్లచెర్వు, ఏప్రిల్ 17 : మండల పరిధిలోని హేమ్లాతండా, కప్పలకుంటతండాలో గురువారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ ఏఈ వెంకటేశ్వర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ ఫీడర్ కింద చెట్ల కొమ్మలను తొలగించనున్నందున వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఎద్దు దాడిలో గాయపడ్డ వ్యక్తి మృతి

నాగారం, ఏప్రిల్ 17 : ఎద్దు దాడిలో గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతిచెందాడు. నాగారం మండలం వర్ధమానుకోట గ్రామానికి చెందిన నర్సిరెడ్డి (53) ఈ నెల 10న గడ్డిమోపు తీసుకుని వస్తుండగా ఆ సమయంలో ఎద్దు వెనుక నుంచి వచ్చి పొడిచింది. దాంతో నర్సిరెడ్డి మెడకు తీవ్రగాయాలు కాగా చికిత్స కోసం హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతి చెందాడు. తల్లి భద్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

నూతన స్వాగత తోరణం ప్రారంభంలో పాల్గొన్న తల్లాడ నారాయణ

వెంపటిలో దేవాలయ తోరణం ప్రారంభం

తుంగతుర్తి, ఏప్రిల్ 17 : మండల పరిధి వెంపటి గ్రామంలో గల గణేశ్, సీతారామ, ఉమామహేశ్వర దేవాలయ నూతన తోరణాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం నాయకులు ఓరుగంటి సత్యనారాయణ, తాటికొండ సీతయ్య మాట్లాడుతూ.. వెంపటి గ్రామ వాస్తవ్యులు తల్లాడ వెంకట నర్సయ్య లక్ష్మమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు నారాయణ ధనలక్ష్మి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో రూ.6 లక్షలు వెచ్చించి ఆలయ తోరణం నిర్మించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షుడు ఓరుగంటి శ్రీనివాస్, బీజేపీ కిసాన్ మోర్చ రాష్ట్ర నాయకులు దాయం ఝాన్సీరాజిరెడ్డి, అబ్బగాని సత్యనారాయణ, ఆర్యవైశ్య సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

జాతీయ అగ్నిమాపక వారోత్సవాలు

మేళ్లచెర్వు, ఏప్రిల్ 17 : మేళ్లచెర్వులోని మైహోం సిమెంట్ పరిశ్రమలో జాతీయ అగ్నిమాపక వారోత్సవాలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశ్రమ ప్రెసిడెంట్ వర్క్స్ యూనిట్ హెడ్ ఎన్.శ్రీనివాస్ రావు మాట్లాడుతూ అగ్నిమాపక అధికారులు చేసిన సూచనలు కార్మికులు తప్పనిసరిగా పాటించాలన్నారు. వేసవికాలం దృష్ట్యా అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అగ్నిప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హుజూర్‌నగర్ అగ్నిమాపక సిబ్బంది, సంస్థ జనరల్ మేనేజర్ డాక్టర్ నాగేశ్వర్‌రావు, సేఫ్టీ అధికారులు సూర్యనారాయణ, వేణునాయుడు, ఫైర్ ఆఫీసర్ లక్ష్మయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

మంచినీటి సమస్య తలెత్తకుండా చర్యలు

- ఎంపీఓ శ్రీనివాస్

నాగారం, ఏప్రిల్ 17 : వేసవి కాలంలో మండల పరిధిలోని గ్రామాల్లో మంచినీటి సమస్య తలెత్తకుండా కలెక్టర్ ఆదేశాల మేరకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీఓ దారా శ్రీనివాస్ తెలిపారు. బుధవారం మండల పరిధిలో మంచినీటి సమస్య ఉన్న లక్ష్మాపురం, ఆవాస గ్రామం మేక్యాతండా, శాంతినగర్ గ్రామాల్లో బోర్లు వేయించినట్లు తెలిపారు. మంచినీటి సరఫరా విషయంలో పైప్‌లైన్ లీకేజీలు, హ్యాండ్ బోర్ రిపేర్ల సమస్యలు ఎప్పటికప్పుడూ గుర్తించి చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ చందన, కార్యదర్శులు గోపి, వీరేందర్ పాల్గొన్నారు.

జేత్యతండాలో ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్

దైవచింతనతో మానసిక ప్రశాంతత

- మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

దేవరకొండరూరల్, ఏప్రిల్ 17 : దైవచింతనతోనే మానసిక ప్రశాంతత కలుగుతుందని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. మండలంలోని జేత్యతండాలో ఆభయాంజనేయ స్వామి ఆలయం ప్రారంభోత్సవం, ధ్వజస్తంభ, ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మండలంలోని ఇద్దంపల్లి గ్రామంలోని సీతారామచంద్రస్వామి కల్యాణమహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో ఆయన వెంట మల్‌రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ధర్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నూతనఘంటి రఘు, బొడ్డుపల్లి కృష్ణ పాల్గొన్నారు.

విగ్రహాలకు అభిషేకం చేస్తున్న భక్తులు

కనుల పండువగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

- పాల్గొన్న ఎమ్మెల్యే వేములవీరేశం దంపతులు

చిట్యాల, ఏప్రిల్ 17 : చిట్యాలలోని అంబేద్కర్ నగర్‌లో నిర్మించిన సీతారామ చంద్రస్వామి ఆలయంలో జరిగిన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం కనుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంపుష్ప దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే చిట్యాల శివాలయంలో నిర్వహించిన సీతారాముల కల్యాణ మహోత్సవంలో పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు చిట్యాల మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి దంపతులు పట్టు వస్త్రాలను సమర్పించారు. చిట్యాల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, కౌన్సిలర్ మౌనికాశేఖర్, పోకల దేవదాసు, ఎద్దులపురి కృష్ణ, వనమా వెంకటేశ్వర్లు, దాసరి నర్సింహ పాల్గొన్నారు. శివాలయం కల్యాణోత్సవంలో చైర్మన్ రంగా వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు కోనేటి కృష్ణ, బెల్లి సత్తయ్య, జిట్ట పద్మా బొందయ్య, రెముడాల లింగస్వామి, పందిరి గీతారమేశ్, వనమా వెంకటేశ్వర్లు, జమాండ్ల శ్రీనివాస్‌రెడ్డి, తేరటుపల్లి హన్మంతు, పొన్నం లక్ష్మయ్య, పందిరి శ్రీనివాసులు, రెముడాల మధు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేత జనార్దన్ మృతికి ప్రముఖుల సంతాపం

నల్లగొండ, ఏప్రిల్ 17 : నల్లగొండ పట్టణ శివారులో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి సందినేని జనార్దన్ రావు మృతి చెందడంతో పట్టణంలో పలువురు ప్రముఖులు తమ సంతాపం తెలిపారు. జనార్దన్‌రావు టీడీపీ ఆవిర్భావం నుంచి అందులో పనిచేసి చురుకైన నేతగా ఎదిగారు. 2018 శాసన సభ ఎన్నికల ముందు బీఆర్ఎస్‌లో చేరారు. మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి , బీఆర్ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డికి ప్రధాన అనుచరుడిగా పేరు తెచ్చుకున్నాడు. గత మున్సిపల్ ఎన్నికల్లో శ్రీనగర్ కాలనీ 19వ వార్డు నుంచి పోటీ చేసి ఓడిపోయారు. జనార్దన్ రావు స్వగ్రామం నకిరేకల్ మండలం మంగళపల్లి.

బైక్‌ను ఢీ కొట్టిన కారు, ఇన్‌సెట్‌లో జనార్దన్‌రావు (ఫైల్)

ఆయన మృతి వార్త తెలుసుకొన్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుండకండ్ల జగదీశ్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేసి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

జనార్దన్‌రావు మృత దేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మాజీ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డితో పాటు కౌన్సిలర్లు, వివిధ పార్టీల నేతలు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రఘుబాబును పోలీసులు అదుపులోకి తీసుకోని సొంత పూచీ కత్తుపై విడుదల చేసినట్లు తెలుస్తున్నది.

జనార్దన్‌రావు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- బంధువుల చావుకి వెళ్లొస్తుండగా ఘటన

చిట్యాల, ఏప్రిల్ 17 : బంధువుల చావుకి వెళ్లి వస్తూ రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ సైదాబాబు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పేరెపల్లి గ్రామానికి చెందిన రూపని యాదయ్య(58) చిట్యాల మున్సిపాలిటీ పరిధిలోని శివనే నిగూడెంలో బుధవారం బంధువు చావుకి వెళ్లి తిరిగి తన ఇంటికి బైక్‌పై మధ్యాహ్నం బయల్దేరాడు. ఈ క్రమంలో వెలిమినేడు శివారులోకి చేరుకోగానే అతివేగంగా వెళ్తున్న తన వాహనాన్ని అదుపు చేయలేక రోడ్డు పక్కన ఉన్న చెట్టు ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

ఉరేసుకొని యువతి ఆత్మహత్య

నల్లగొండ సిటీ, ఏప్రిల్ 17 : కనగల్ మండలం పర్వతగిరి గ్రామంలో శుక్రవారం ఉరేసుకొని యువతి ఆత్మహత్య చేసుకొంది. కనగల్ ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చెనగాని కావ్య(20) రెండేళ్లుగా ఫిట్స్‌తో బాధపడుతూ తీవ్ర మనోవేదనకు గురైంది. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొంది. మృతురాలి తల్లి లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

సూర్యాపేట జనరల్ ఆస్పత్రిలో వసూళ్లపై ఫిర్యాదు

బొడ్రాయిబజార్, ఏప్రిల్ 17 : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో వైద్య సిబ్బంది ప్రజల నుంచి చేస్తున్న అక్రమ వసూళ్లపై సూర్యాపేట మండల బాలెంల గ్రామానికి చెందిన ఎ.శ్రీకాంత్ మెడికల్ సూపరింటెండెంట్‌తో పాటు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ హైదరాబాద్, జిల్లా కలెక్టర్, మెడికల్ ఆఫీసర్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. మాతా శిశు కేంద్రంలో బాబు పుడితే రూ.2 వేలు, పాప పుడితే వెయ్యి చొప్పున సెక్యూరిటీ గార్డ్స్‌కి డబ్బులు ఇస్తేనే లోపలకు అడగు పెట్టనిస్తున్నారని, అలాగే శానిటేషన్, స్టాఫ్ ధోబీ ఆస్పత్రి నుంచి జీతాలు తీసుకుంటూ కూడా బట్టలు ఉతికినందుకు, మార్చినందుకు ప్రతి రోగి నుంచి రూ.500 నుంచి వెయ్యి వరకు వసూలు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. డబ్బులు ఇవ్వని వారిపై దుర్భాషలాడుతున్నారని, ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేస్తామంటే.. చేసుకోమని మమ్మల్ని ఏమీ అనరని మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. న్యూట్రిషన్, ఇతర కిట్లు ఇచ్చినందుకు స్టాంపులు వేసేందుకు కూడా రూ.100 నుంచి 500 వసూలు చేస్తున్నట్లు ఆరోపించారు. వీరిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. తాను మా అక్క డెలివరీ సమయంలో ఆస్పత్రిలో జరిగిన వసూళ్ల పరిస్థితి చూసి వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయమై అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

మోదీ మోసగాడు.. బీజేపీకి ఓటేయొద్దు

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి

నకిరేకల్, ఏప్రిల్ 17: నరేంద్రమోదీ మోసగాడు.. బీజేపీకి ఓటేయొద్దని, ఎన్నికల ముందు హామీల ఆశజూపి గెలిచిన తరువాత వాటిని విస్మరిస్తారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి విమర్శించారు. నకిరేకల్ సీపీఎం కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తూ సామన్యులపై ధర భారం మోపుతున్నాడని విమర్శించారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, తుమ్మల వీరారెడ్డి, నాయకులు కందాల ప్రమీల, బొజ్జ చిన్నవెంకులు, రాచకొండ వెంకట్‌గౌడ్, వంటిపాక వెంకటేశ్వర్లు, తాజేశ్వర్, కృష్ణ, మారయ్య, నాగమణి పాల్గొన్నారు.

ఎండిన పందిళ్లపల్లి చెరువు

- పదేండ్లలో మొదటి సారిగా అడుగంటిన భూగర్భ జలాలు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతులు
- రూ.80 లక్షలతో మినీ బ్రిడ్జిని నిర్మించిన బీఆర్ఎస్ ప్రభుత్వం

మిర్యాలగూడ, ఏప్రిల్ 17 : పదేండ్లుగా నిండుకుండలా కళకళలాడిన పందిళ్లపల్లి చెరువు నేడు నీరు లేక ఎండిపోయింది. మిర్యాలగూడ పట్టణం, యాద్గార్‌పల్లి గ్రామ శివారులో ఈ చెరువు ఉంది. మిర్యాలగూడ నియోజకవర్గంలో అతిపెద్దదైన పందిళ్లపల్లి చెరువు 500 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. మండలంలోని మేజర్ చెరువులన్నింటిలో నీరు అడుగంటి నెర్రెలు బారాయి. గత ప్రభుత్వం ఈ చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా ఎంపిక చేసి పలు అభివృద్ధి పనులు చేపట్టింది. బలహీనంగా ఉన్న చెరువు ప్రధాన కట్టను తిరిగి పునర్నిర్మాణం చేసింది. రూ.80 లక్షలతో మినీ బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. అలాగే 150 మీటర్ల పొడవైన బతుకమ్మ ఘాట్ నిర్మించింది.. చెరువు సమీపంలో ఉన్న ఉమా మహేశ్వరస్వామి ఆలయం నుంచి నల్లగొండ రోడ్డు వరకు రోడ్డు నిర్మించారు. ఈ చెరువులో తెలంగాణ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో బోటింగ్ కూడా కొనసాగుతున్నది. నేడు నీరు లేకపోవడంతో బోటింగ్ కూడా నిలిచిపోయింది. నేడు చెరువు ఎండిపోయి బోసిగా ఉండడంతో ఇక్కడికి ఎప్పుడు వచ్చే ప్రజలు, పర్యాటకులు నిరుత్సాహంతో చూసి వెళ్తున్నారు.

పందిళ్లపల్లి చెరువు ఎండిపోవడంతో వృధాగా ఉన్న బోటింగ్ పార్కులో పడవలు

మిర్యాలగూడ పట్టణం, యాద్గార్‌పల్లి గ్రామ శివారులో విస్తరించి ఉన్న పందిళ్లపల్లి చెరువు ఎండిపోయిన దృశ్యం

నాడు 5వేలు.. నేడు 10 ఎకరాల్లోనే సాగు..

మిర్యాలగూడ పందిళ్లపల్లి చెరువు నిండుగా ఉన్నప్పుడు మిర్యాలగూడ పట్టణ శివారులోని పొలాలతోపాటు యాద్గార్‌పల్లి, కాల్వపల్లి, కాల్వపల్లితండా, ఎర్రావులపాడు, బాదలాపురం, అవంతీపురం, గూడూరు, కిష్టాపురం గ్రామాల పరిధిలో చెరువు అలుగుల ద్వారా వస్తున్న వృథా నీటిని మోటార్ల ద్వారా పైప్‌లైన్ వేసుకోని పొలాలు పారించుకునేవారు. చెరువు ప్రభావం వల్ల బోరుబావుల్లో నీరు పుష్కలంగా లభించేది. చెరువు ఎండిపోవడం వల్ల ఈ యాసంగి సీజన్‌లో కేవలం చెరువు కట్ట వెంబడి పది ఎకరాల్లో మాత్రమే వరి సాగు చేశారు. తొమ్మిది గ్రామాల పరిధిలో గతంలో 5వేల ఎ కరాల్లో వరి సాగు చేశారు. నేడు నీటి లభ్యత లేకపోవడంతో 5వేల ఎకరాలను రైతులు బీళ్లుగానే ఉంచారు. ఒక్క చెరువు ఎండిపోవడంతో వేలాది మంది రైతులు నేడు విలవిల్లాడుతున్నారు.

ఎడమకాల్వ ద్వారా చెరువును నింపితే రైతులకు మేలు

పందిళ్లపల్లి చెరువును నాగార్జునసాగర్ ఎడమకాల్వ పరిధిలోని యాద్గార్‌పల్లి మేజర్, ముల్కలకాల్వ మేజర్ల ద్వారా నింపే అవకాశం ఉంది. కానీ పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో ఈ చెరువును నింపకుండా నిర్లక్ష్యం చేశారు. పాలకుల నిర్లక్ష్యం కారణంగా నేడు 9గ్రామాలు మంచినీటి సమస్యను ఎదుర్కొంటున్నాయి. ప్రభుత్వం స్పందించి సాగర్‌నీటితో చెరువులు నింపాలి. మండలంలోని అన్ని మేజర్ చెరువులు నింపి ప్రజల దాహార్తి తీర్చాలి.

– నల్లమేకల వెంకులు (బాదలాపురం)

తొమ్మిది గ్రామాల పరిధిలో అడుగంటిన భూగర్భ జలాలు...

మిర్యాలగూడ పట్టణంలోని పందిళ్లపల్లి చెరువు సుమారు 500 ఎకరాల విస్తీర్ణంలో పరుచుకోని ఉండడంతో నీటి నిల్వ అధికంగానే ఉంటుంది. పదేండ్లుగా చెరువు నిండా నీరు ఉండి పరిసర ప్రాంతాల్లో ఉన్న గ్రామాల్లో భూగర్భజలాలు పుష్కలంగా పెరిగి రైతులు వరిసాగు చేసుకోగా ఆనందంగా పంటలు పండించుకున్నారు. నేడు చెరువు ఎండిపోవడంతో మిర్యాలగూడ పట్టణం, యాద్గార్‌పల్లి, కాల్వపల్లి, కాల్వపల్లి తండా, ఎర్రావులతండా, బాదలాపురం, అవంతీపురం, గూడూరు, కిష్టాపురం గ్రామాల పరిధిలో రైతులు భూగర్భజలాలు అడుగంటి పోవడంతో పంటలు సాగు చేయకుండా భూములను బీళ్లుగానే ఉంచారు. అలాగే మిర్యాలగూడ పట్టణంలోని రామచంద్రగూడెం, చైతన్యనగర్, రాంనగర్, షాబునగర్ కాలనీల పరిధిలో చెరువు ఎండిపోవడంతో ఇండ్లలో ఉన్న బోర్లు సైతం ఎండిపోయి ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

WANTED
★KFC Hiring P/F Time Jobs in Hyd. SSC Pass, 18 yrs Abv. M&F. 13k with Food & Accom. PF/ Medical/ Bonus/ Incentive. Ph: 9392526486, 9704449461, 8688442326.
NT-136-AI

WANTED
★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K Ph: 9640258899/9640468899
NT-311829

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించ కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మరి "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/- ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available Minimum 4 Lines, Extra Line - Extra Amount
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం,
సల్లగొండ : 9182777626 | సల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059 | నార్కట్‌పల్లి : 9182777630 | భువనగిరి : 9182777630
మిర్యాలగూడ : 9182777059 | కోదాడ : 9182777100 | కోదాడ : 9182777630